క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కొమరాడ: ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు ప్రిపేర్ అవుతున్న మండలంలోని మాదలింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కురుపాం ప్రాంతానికి చెందిన యస్ సొసైటీ సభ్యులు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గతేడాది మాదిరిగానే బాగా చదివి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలని సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆకాంక్షించారు. గతేడాది ఇదే పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో స్కాలర్‌షిప్ పొందుతున్నారని ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంతో పాటు సైబర్ క్రైమ్, మత్తు పదార్థాల వినియోగం, విక్రయాల వల్ల కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

కషాయంతో చీడపీడల నివారణ



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: చీడపీడల నివారణకు వేప, తదితర కాషాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి, రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మారుతీ, సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

వీరఘట్టం: రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తలవరంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం భూములకు సంబంధించిన వన్‌బీ, అడంగల్ కాపీలను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ బి.ప్రసాదరావు, ఆర్ఐ లక్ష్మణనాయుడు, వీఆర్ఓ భీమన్నదొర, తదితరులు పాల్గొన్నారు.


అధ్వాన రహదారులతో అవస్థలు



పాలకొండ - వీరఘట్టం రహదారి దుస్థితి

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం రహదారి పూర్తిగా గోతులతో నిండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పెట్రోల్‌బంక్ వద్ద, వీపీ రాజు పేట కూడలి వద్ద రోడ్డు మరీ దారుణంగా తయారైంది. తంపటాపల్లి, తుమరాడ వద్ద కూడా రోడ్డుపై గోతులేర్పడ్డాయి. తుమరాడ – అట్టలి గ్రామాల మలుపుల వద్ద రోడ్డు పైభాగంలో పెచ్చులూడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పనుకువలస, నవగాం సమీపంలో కూడా రోడ్డుపై గోతులేర్పడ్డాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొత్తగూడ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: నంద్యాలలో ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని కొత్తగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలురు) విద్యార్థులు మంగళవారం పయనమయ్యారు. ఎంపికైన వారిలో నిమ్మల జితేంద్ర, ఆరిక చరణ్, ఆరిక చందు, మండంగి అఖిల్, చంద్రదేవ్ ఉండగా, వారంతా ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ ఎస్.మాధవరావు తెలిపారు.

తప్పులు సరి చేసుకోవాలి..



ఈకేవైసీలో నమోదైన వివరాల్లో తప్పులుంటే వెంటనే సరిదిద్దుకోవాలని వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి సూచించారు. మండలంలోని కొండాపురంలో ఈకేవైసీపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తప్పులను సరిచేసుకోవడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులుండవని చెప్పారు. నమోదు చేసిన పంటల వివరాలను వీఏఏ నీలిమ వివరించారు. అలాగే ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. – పాలకొండ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక , ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటంపై సమీక్షించేందుకు ఈ నెల 19,20 తేదీల్లో పాలకొండలో జిల్లా ట్రేడ్ యూనియన్స్ కమిటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఈ సమావేశాల్లో పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. సభలకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం. అప్పలస్వామి, ఎ.లక్ష్మణరావు, కాద రాము, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ

ఒత్తిడిని జయిస్తే సంపూర్ణ ఆరోగ్యం..



ఒత్తిడిని జయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. సామాజిక వేత్త, జిల్లా మానసిక ఆరోగ్య బృంద సభ్యుడు కె. కృష్ణారావు నేతృత్వంలో మానసిక ఆరోగ్య వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించే విధానాలు.. యోగా, వ్యాయామాలపై కృష్ణమూర్తి వివరించారు. పనిలో ఒత్తిడిని ఎలా అధిగమించాలో వైద్యుడు కడియం చిరంజీవి, నర్సింగ్ సూపరింటిండెంట్ సౌధామని అవగాహన కల్పించారు.

– పాలకొండ రూరల్

వైభవంగా శ్రీవారి చక్రస్నానం

గరుగుబిల్లి: పవిత్రోత్సవాలు పురస్కరించుకుని, తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి చక్రస్నానం కార్యక్రమం అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, చూర్ణోత్సవం, స్వపనం, మంగళాశాసనం, శాత్తుమురై తదితర పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం ఉత్సవమూర్తులను నదీతీరానికి తోడ్కొని వచ్చి, మంగళవాయిద్యాల నడుమ జలాభిషేకం, పాలాభిషేకం చేసి, విశేషార్చనలు చేశారు. ఈ పూజల్లో పాల్గొన్న వారికి వేయి నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన పుణ్యం, ఆయురారోగ్యాలు లభిస్తాయని సకల శుభాలు కలుగుతాయని అర్చకులు అప్పలాచార్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్రోత్సవాల ఆరంభం రోజున ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ కిందకు దించి, శ్రీవారికి పుష్పార్చన చేసిన అనంతరం పవిత్రోత్సవాలను ముగించారు.



స్వామి వారికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

నందెన్న ఉత్సవాలకు సిద్ధం

గరుగుబిల్లి: గౌరీపౌర్ణమి పురస్కరించుకుని, నందెన్న ఉత్సవాలకు అంతా సిద్ధం చేశారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి, చినగుడబ, గొట్టివలస, కొత్తూరు తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి జరగనున్న వేడుకలకు నందెన్న ఉత్సవ విగ్రహంతో పాటు గంగాపార్వతీసమేత శివుడు, వినాయక విగ్రహాలను మండపాలకు తరలించారు. పంటలు బాగా పండాలని గౌరమ్మ, గంగాదేవిలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మండలంలోని రావివలస గ్రామంలో గౌరీపౌర్ణమి వేడుకలు గురువారం రాత్రి నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు.

సిద్ధమవుతున్న నందెన్నలు

భామిని: గౌరీపౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో సందడి చేసేందుకు మట్టి నందన్నలు రూపుదిద్దుకుంటున్నాయి. మండలంలోని సింగిడిలో మట్టితో గౌరీ సమేత శివపార్వతులు అధిష్ఠించిన నందీశ్వరుల విగ్రహాలు తయారు చేస్తున్నారు. గౌరీపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించే వారు విగ్రహాలను కొనుగోలు చేస్తారని తయారీదారులు చెబుతున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

● డీఎంహెచ్ఓ విజయపార్వతి

వీరఘట్టం: సుఖ ప్రసవాలే లక్ష్యంగా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ మందుల రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి ప్రతిరోజూ ఎంతమంది వస్తున్నారు.. వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మందులు, వ్యాక్సిన్ల లభ్యతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవం జరుపుకున్న బాలింతలు, చిన్నారులను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ త్వరగా చేపట్టి వారికి ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీరఘట్టం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్, డెమో యోగీశ్వరరెడ్డి, ఈఓ జగన్నాథరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ విజయపార్వతి

సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని కోరారు. అలాగే నిర్వాహకులకు ప్రమాదబీమా వర్తింపజేయాలన్నారు. కార్మిక హక్కులు సాధించేవరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రొయ్య బారి, చామంతి, విలాసవతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు

పక్కాగా చట్టాలు అమలు చేయాలి

కొమరాడ: గిరిజనులకు సంబంధించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వాకాడ ఇందిర కోరారు. మండలంలోని పెదశాఖ గ్రామంలో బిడ్డిక మధు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆ పార్టీ మహాసభలో పాల్గొన్న ఆమె.. తొలుత వారి పార్టీ జెండాను ఆవిష్కరించి కాసేపు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం పక్కనపెట్టి, మత విద్వేషాలు రెచ్చగొట్టే పనిలో ఉన్నాయని విమర్శించారు. చాలా గిరిజన ప్రాంతా ల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేవని, ప్రభుత్వాలు స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు సాంబమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇందిర

అభ్యసనా వైకల్యంపై అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది అంతా కలిసి డిస్‌లెక్సియా(అభ్యసన వైకల్యం) మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థుల జీవితంలో ఏదో ఒక దశలో చదవగల సామర్థ్యం కన్నా తక్కువ చదవడాన్ని అభ్యసన వైకల్యంగా పేర్కొనవచ్చని, అలాంటి వారిని గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపడితే వారిలో పురోగాభివృద్ధి చూడవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అటువంటి సమస్యతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావు, ఐఈఆర్‌టీ ఎం.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీమాస్త్రంతో సస్యరక్షణ

భామిని: సేంద్రియ వ్యవసాయ విధానంలో సస్యరక్షణకు నీమాస్త్రం ఉపయోగపడుతుందని ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనీ మోటక అంబోజీ, ఐసీఆర్‌పీ వల రౌతు ప్రభాకరరావు అన్నారు. మండలంలోని బిల్లుమడలో ప్రకృతిసాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన రైతు బూస బాల కృష్ణకు చెందిన పత్తి పొలంలో వేపాకులు, గోమూత్రంతో నీమాస్త్రం తయారు చేసి పిచికారీ చేసే విధానంపై వివరించారు.

మద్యం దుకాణం కేటాయింపుపై ఫిర్యాదు

సీతంపేట: షెడ్యూల్డ్ ఏజెన్సీలో స్థానికేతర గిరిజనులకు మద్యం షాపు కేటాయించడంపై కలెక్టర్, డీఆర్ఓలకు ఫిర్యాదు చేసినట్లు స్థానిక గిరిజన సంఘ నాయకులు హిమరక ప్రసాద్, కె.అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండగొర్రె అన్నపూర్ణ గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేశారని, పాలకొండలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆమెకు సీతంపేటలో మద్యం షాపు కేటాయించడం తగదన్నారు. ఇప్పటికైనా ఆమెకు కేటాయించిన షాపును రద్దు చేసి సీతంపేట ఏజెన్సీ గిరిజనులకు కేటాయించాలని కోరినట్లు పేర్కొన్నారు.

అభినందనలు

భామిని: మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీగా బాధ్యతలు స్వీకరించిన ఎ.శంకరరాయుడును రెవెన్యూ సిబ్బంది మంగళవారం అభినందించారు. జీఎల్ పురం నుంచి బదిలీపై వచ్చిన డీటీ శంకరరాయుడును ఆర్ఐ కె.కృష్ణారావు, డీలర్ల సంఘ కార్యదర్శి ఎ.సంతోష్‌కుమార్, వీఆర్ఓల అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.భారతి, వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు బి.మిన్నారావు, తదితరులు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన డీటీ శంకరరాయుడు తహసీల్దార్ నీలాపు అప్పారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యాభివృద్ధికి ప్రోత్సాహం

భామిని: గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు దూరమయ్యే విద్యార్థులకు ఆర్థిక చేయూత ద్వారా ఆదుకోవాలన్నదే సర్వజన శ్రేయోభిలాష సంస్థ ధ్యేయమని సంస్థ సభ్యుడు, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రొక్కం రామారావు అన్నారు. బాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. పది వేల చొప్పున హెచ్ఎం జామి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న బాలేరు – సొలికిరి గ్రామాలకు చెందిన వారి సహకారంతో ఆర్థిక సాయం చేసినట్లు రామరావు తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్‌పర్సన్ బోనంగి రూపావతి, టీచర్లు, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

ఆకట్టుకున్న వర్ణచిత్రం

మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గరుగుబిల్లి మండలం, నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు మంగళవారం గీసిన అబ్దుల్ కలాం వర్ణచిత్రం చూపరులను ఆకట్టుకుంది. సదరు చిత్రకారుడు గత కొన్నేళ్లుగా వర్ణచిత్రాలు, నఖచిత్రాలు వేస్తూ తనలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.



–గరుగుబిల్లి

బడితోటల పెంపకంపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: బడితోటల పెంపకంపై దృష్టి సారించాలని డీఈవో జి.పగడాలమ్మ సూచించారు. మండలంలోని రావుపల్లి, కొత్తూరు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు శివ్వాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆమె.. అక్కడ పెంచుతున్న బడితోటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పాఠశాలల ఖాళీ స్థలాల్లో బడితోటల పెంపకంలో భాగంగా ఆకుకూరలు, కాయగూరలను పండించాలని తెలిపారు. విద్యార్థులకు సాగు విధానాలపై కూడా అవగాహన కల్పించేందుకు ఈ బడితోటలు ఉపయోగపడతాయన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో దత్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



శివ్వాంలో బడితోట పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

వినతిపత్రం అందజేత

గరుగుబిల్లి: జంఝావతి కాలువ ద్వారా సాగునీరు అందివ్వాలని కోరుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి వారు హాజరై, సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ఆదేశించి, సాగునీరు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, గరుగుబిల్లి నుంచి పెద్దూరు, బీవీపురం, ఉద్దవోలు రోడ్లను బాగుచేయాలని ఎమ్మెల్యేను కోరారు. గరుగుబిల్లికి నైట్‌హాల్ట్ బస్సు వేయాలని పలువురు అభ్యర్థించారు.



ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సూచనలు పాటించాలి

పాలకొండ రూరల్: వరి పంట కీలక దశలో ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని నవగాంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతానికి వరి పైరుకు ఎటువంటి తెగుళ్లు ఆశించనప్పటికీ, రైతులు మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో ఇప్పటికే పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని చెప్పారు.



నవగాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రెడ్డి వేణు

సీతంపేట: పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటాయన్నారు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెబుతూనే ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారన్నారు. గతంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించిన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు వాటినే ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకు వ్యతిరేకంగా ఈ నెల 18న అన్ని మండల విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.తిరుపతిరావు, శ్రీరాములు, రమణరావు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ, పి.ఆమిటి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి, జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అంతకుముందు ఏవో సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా నేలకు అనువైన పంట వేసుకుని పండించాలని, పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల కో–ఆర్డినేటర్ గణేష్‌చంద్ర, పి.ఆమిటి సర్పంచ్ తాడంగి దమయంతి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లేడు ద్రావణాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి చూపిస్తున్న సిబ్బంది

కాంట్రాక్ట్ లెక్చరర్ల నిరసన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు (ఒప్పంద అధ్యాపకులు) పసుపు రిబ్బన్లు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. తమను రెగ్యులర్ చేయాలని, జీవో నంబర్ 114ను తక్షణమే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో తమను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తమ ఉద్యోగాలను కొనసాగించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



పసుపు రిబ్బన్లు ధరించి, నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు